క్లుప్తంగా

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ మృతి

కొత్తూరు: ఉమ్మడి కొత్తూరు మండలం మాజీ ఎంపీపీ మామిడి జయశ్రీ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆమె గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, ఆదివారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రమాదమని తెలిసినా...!



విద్యుత్ స్తంభాన్ని కలుపుకుని స్లాబ్ వేసిన ఇల్లు

మొయినాబాద్: ఇళ్ల సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలు, ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలతో జరిగే ప్రమాదాలను చూస్తూనే ఉంటాం. కానీ ఓ వ్యక్తి విద్యుత్ ప్రమాదాన్ని ఇంటిపైనే పెట్టుకున్నాడు. మొయినాబాద్ మండలంలోని నక్కలపల్లిలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణ సమయంలో స్థలానికి కక్కుర్తి పడి విద్యుత్ స్తంభాన్ని స్లాబులోనే కలిపేసుకున్నాడు. దీంతో ఆ ఇంటిపై ఎప్పుడు విద్యుత్ ప్రమాదం జరుగుతుందోనని కుటుంబ సభ్యులతో పాటు చుట్టుపక్కల వారు భయాందోళన చెందుతున్నారు.

గ్రామ కమిటీ ఎంపిక

కేశంపేట: మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎంపిక చేశారు. గ్రామంలోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో గ్రామంలోని కాంగ్రెస్ కార్యకర్తలు సమావేశమై నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కుమార్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా గణేష్, ప్రధాన కార్యదర్శిగా రాజు, యువజన అధ్యక్షుడిగా అఖిల్, ఉపాధ్యక్షుడిగా కుమ్మరి రఘులను ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు రూప్లానాయక్, రాఘవేందర్‌రావు, గ్రామస్తులు నరసింహ పంతులు, యాదగిరిచారి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

షాబాద్: ఈనెల 23వ తేదీన షాబాద్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అనురాధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్తు కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి తదితరులు హాజరవుతారన్నారు. అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ,ఆయా శాఖల అధికారులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

సురంగల్‌లో ఎస్‌పీఎల్



క్రికెట్ జట్లతో నిర్వాహకులు

మొయినాబాద్: మండల పరిధిలోని సురంగల్‌లో ఆదివారం సురంగల్ ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామానికి చెందిన నిర్దుల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆరు జట్లు టోర్నమెంట్‌లో తలపడ్డాయి. లయన్స్, ఆర్‌కే జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఆర్‌కే జట్టుపై లయన్స్ జట్టు విజయం సాధించింది. విజయం సాధించిన లయన్స్ జట్టుకు రూ.10వేల నగదు, రన్నరప్‌గా నిలిచిన ఆర్‌కే జట్టుకు రూ.5 వేల నగదు బహుమతులతో పాటు షీల్డులను అందజేస్తామని నిర్వాహకులు ప్రకటించారు. 26న గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సందీప్‌రెడ్డి, మచ్చేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లే

వాసవీక్లబ్ అధ్యక్షుడు నవీన్‌కుమార్



గోమాతకు పూజలు నిర్వహిస్తున్న సభ్యులు

షాద్‌నగర్: గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని వాసవీక్లబ్ అధ్యక్షుడు గార్లపాటి నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలోని శ్రీకృష్ణ గోశాలలో గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. భగవన్నామ స్మరణను అలవర్చుకోవాలని అన్నారు. గో సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉంద ని చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు రఘుపతిరావు, వాసవీక్లబ్ కార్యదర్శి వెంకటరమణ, దొంతుపాండురంగయ్య, శ్రీనివాస్, యంసానిశ్రీనివాస్, అనిల్‌కుమార్, నరేందర్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

బస్టాపుల్లో ఆటోలు.. రోడ్డుపై బస్సులు

- మొయినాబాద్‌లో ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్
- బ్యాంకులు, హోటళ్లు, దుకాణాలకు లేని పార్కింగ్ స్థలం
- రోడ్లపైనే పార్క్ చేస్తున్న వాహనాలు
- రాకపోకలకు అంతరాయం
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



మొయినాబాద్‌లో బస్టాపులో ఆటోలు ఆగడంతో రోడ్డుపై నిలిచిన ఆర్టీసీ బస్సు

మొయినాబాద్: హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న మొయినాబాద్ మండల కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి మొయినాబాద్ మీదుగా ఉండడంతో ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలు బాగా పెరిగాయి. అయితే, ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న దుకాణాలు, హోటళ్లు, బ్యాంకుల ముందు సరైన పార్కింగ్ స్థలం లేకపోవడంతో మొయినాబాద్‌లో వాహనాల పార్కింగ్ సమస్యగా మారింది. రోడ్డుపై వాహనాలను పార్క్ చేస్తుండడంతో రహదారిపై వెళ్లే వాహనాలకు ఇబ్బంది కలుగుతుంది. ప్రధానంగా బస్టాపుల్లో బస్సులు ఆగినప్పుడు బస్సుల వెనకాల వచ్చిన వాహనాలన్నీ ఆగిపోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ట్రాఫిక్ సమస్య తీర్చడానికి సిగ్నల్ ఏర్పాటు చేసినా దానిని వినియోగించడంలేదు. ట్రాఫిక్ పోలీసులు సైతం అందుబాటులో ఉండకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారుతుంది. ట్రాఫిక్ పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

దుకాణాల ముందు చిన్నచిన్న షాపులు..

మండల కేంద్రంలోని దుకాణ సముదాయాల ముందు చిన్న చిన్న షాపులు ఏర్పాటు చేయడం వల్ల ఆ షాపులకు వచ్చేవాళ్లు వాహనాలను రోడ్డుపైనే పార్కు చేస్తున్నారు. ప్రధానంగా యూనియన్ బ్యాంకు ముందు బస్టాపు ఉంది. బ్యాంకుకు వచ్చేవాళ్లంతా బస్టాపులో వాహనాలు నిలపడంతో బస్సులు ఆగేందుకు స్థలం ఉండడంలేదు.. బస్సుల కోసం నిల్చున్నవారే రోడ్డుపై నిలబడుతున్నారు. బస్టాపు వద్దకు వచ్చిన బస్సులు రోడ్డుపైనే నిలుపుతుండడంతో బస్సు ఆగినంతసేపు వెనకాల ట్రాఫిక్ నిలిచిపోతుంది. అదే విధంగా స్టేట్‌బ్యాంక్ ఉన్న భవనంలోనే ఇంటర్‌నెట్ సెంటర్లు, దుకాణాలు, ఏటీఎంలు, ఆస్పత్రులు, మెడికల్ షాపు ఉన్నాయి. ఇన్ని ఉన్న ఆ దుకాణ సముదాయం ముందు పార్కింగ్ స్థలం లేదు. దుకాణాల ముందు ఉన్న స్థలంలోనూ ఫాస్ట్‌ఫుడ్ బండి, టీఫిన్ సెంటర్, జ్యూస్ సెంటర్ ఏర్పాటు చేశారు. దీంతో బ్యాంకు, ఏటీఎంలు, ఆస్పత్రులు, దుకాణాలకు, ఫాస్ట్‌ఫుడ్, టీఫిన్ , జ్యూస్ సెంటర్లకు వచ్చేవారు వాహనాలను పూర్తిగా రోడ్డుపైనే పార్కు చేస్తున్నారు. ఇలా రహదారికి ఇరువైపుల సుమారు అర కిలోమీటర్ దూరం వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండడంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సోమవారం మరింత ఎక్కువ...

పార్కింగ్, ట్రాఫిక్ సమస్య సోమవారం రోజు మరింత ఎక్కువగా ఉంటుంది. సోమవారం మొయినాబాద్‌లో సంత(అంగడి) ఉండడంతో పరిసర గ్రామాల నుంచి చాలా మంది సంతకు వస్తారు. వాహనాలపై వచ్చే వారు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లపైన, గల్లీల్లో వాహనాలను నిలుపుతున్నారు. దీంతో సాయంత్రం సమయంలో హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది.



మొయినాబాద్ చౌరస్తాలో రోడ్డుపైనే శనగ బూట్ అమ్ముతున్న దృశ్యం

ట్రాఫిక్ సమస్యలు తీవ్రం



రోజురోజుకు ట్రాఫిక్ సమస్య పెరుగుతుంది. పార్కింగ్‌కు సరైన స్థలాలు లేకపోవడంతో వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. ప్రధానంగా బ్యాంకులు, హోటళ్ల ముందు, బస్టాపుల వద్ద సమస్య ఎక్కువగా ఉంది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలి. సిగ్నల్ వ్యవస్థను వినియోగంలోకి తీసుకొచ్చి ట్రాఫిక్ పోలీసులు నిరంతరం అందుబాటులో ఉండాలి.

–గణేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ
చందానగర్, మొయినాబాద్

చర్యలు తీసుకుంటాం



మొయినాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుంది. షాపుల ముందు సరైన పార్కింగ్ స్థలాలు లేక రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. దుకాణదారులు తప్పనిసరిగా వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించాలి. పార్కింగ్ స్థలం లేకుండా వాహనాలను రోడ్డుపై నిలిపితే చర్యలు తీసుకుంటాం. వారం రోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తాం.

–లవకుమార్‌రెడ్డి,
ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, రాజేంద్రనగర్

ప్రతి గీత కార్మికుడికి బీమా కల్పించాలి

ఏఐటీయూసీ నేత రామస్వామి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: గీత పనివార్లకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించి 55 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికుడికి నెలకు రూ.3వేల పింఛన్ ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె. రామస్వామి డిమాండ్ చేశారు. చేవెళ్లలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర గీత పనివార్ల సంఘం క్యాలెండర్‌ను గీతపనివార్ల సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి గీత కార్మికుడికి ప్రభుత్వం పింఛన్ అందించి ప్రభుత్వ భూముల్లో ఈత మొక్కలు పెంచుకునే విధంగా అవకాశం కల్పించాలన్నారు. గీత పనివార్ల సంఘంలో ప్రతి కార్మికుడు సభ్యత్వం తీసుకొని సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరారు. మండల కేంద్రంలో సర్దార్ పాపన్న, దర్మభిక్షంగౌడ్, ప్రతాప్‌లింగంగౌడ్‌ల విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రభులింగం, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కేసారం సర్పంచ్ రమేశ్‌గౌడ్, గీత పనివార్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌గౌడ్, నాయకులు ప్రభాకర్‌గౌడ్, మల్లేశ్, పాండు, సత్యానారాయణ, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లికి తరలిన కాంగ్రెస్ నాయకులు



బిజినేపల్లి తరలుతున్న కాంగ్రెస్ నాయకులు

కొందుర్గు: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఏర్పాటు చేసిన దళిత, గిరిజన ఆత్మగౌరవ సభకు జిల్లేడ్ చౌదరిగూడ మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావలి రాజు జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 22 వాహనాల్లో దాదాపు 200 మంది నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అశోక్, సలీం, నర్సింలు, దామోదర్, శివకుమార్, శ్రీను, బల్వంత్ రెడ్డి, భాస్కర్, వెంకటేష్, మోహన్, నవీన్ గౌడ్, రామకృష్ణ, శ్రీశైలం, జైపాల్, రాములు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

జెడ్పీటీసీ మాలతిక్రిష్ణారెడ్డి



క్రీడాదుస్తుల్లో యువకులు

చేవెళ్ల: యువత అన్ని రంగాల్లో రాణించాలని చేవెళ్ల జెడ్పీటీసీ మర్పల్లి మాలతిక్రిష్ణారెడ్డి అన్నారు. మండలంలోని క్రికెట్ జట్టు సభ్యులకు ఆదివారం స్పోర్ట్స్ డ్రెస్, క్రికెట్ కిట్లను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాలతి మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహిస్తే వారిలోని ప్రతిభను వెలికి తీయవచ్చాన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎంతో నైపుణ్యం ఉన్న క్రీడాకారులు ఉన్నారని వారిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. దీనికి టోర్నమెంట్‌లు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. మండలంలోని క్రీడాకారులకు తమ వంతు సహకారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో క్రీడాకారులు, యువకులు, గ్రామస్తులు ఉన్నారు.

ముగిసిన కేపీఎల్ టోర్నీ

విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు, నాయకులు

కొందుర్గు: మండల కేంద్రంలోని గత వారం రోజులుగా కొనసాగుతున్న కొందుర్గు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ టోర్నీలో 8 జట్లు పాల్గొనగా హైదరాబాద్ , ముంబాయి ఇండియన్స్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు విజయం సాధించగా ముంబాయి ఇండియన్స్ రన్నరప్‌గా నిలిచింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమని, క్రీడాకారులు సంయమనం పాటించి, ఓటమి గెలుపునకు నాందీగా భావించాలని సూచించారు. ప్రథమ బహుమతిగా హైదరాబాద్ జట్టుకు కొందుర్గు సర్పంచ్ ఆదిలక్ష్మి రూ. 30 వేలు నగదును అందజేశారు. ద్వితీయ బహుమతి అందుకున్న ముంబాయి ఇండియన్స్ జట్టుకు చౌరస్తా కహని నిర్వాహకులు రూ. 20 వేల నగదు బహుమతి అందజేశారు. వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ మెమోంటోలను ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు చిన్న రాజుగౌడ్, కావలి ప్రవీన్, సచిన్ సాయి, నాయకులు రామకృష్ణ, కావలి యాదయ్య, శ్రీను, చంద్రశేఖర్, సుందర్, ప్రభాకర్, మానయ్య, పెద్ది శ్రీను, రామయ్య గౌడ్, రమేష్ గౌడ్, నరేందర్ గౌడ్, శబ్బీర్, ప్రేమ్ కుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


బహుజన సాహిత్య జాతీయ అవార్డుకు సర్పంచ్ ఎంపిక



అవార్డుకు ఎంపిక చేస్తూ ఉత్తర్వులు అందజేస్తున్న నిర్వాహకులు

కొందుర్గు: మండలం పరిధిలోని ముట్పూర్ గ్రామ సర్పంచ్ ఎస్ నర్సింహ్మారెడ్డి బహుజన సాహిత్య జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో చేసిన విశేష కృషికి సాహిత్య అకాడమీ వారు తనను ఈ అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. నిర్వాహకులకు నర్సింహ్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్‌వీ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సబిత

శంకర్‌పల్లి: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్వీ విద్యార్థి విభాగం సంఘం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని మంత్రి నివాసంలో బీఆర్‌ఎస్వీ విద్యార్థి విభాగం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కాలె యాదయ్య, హుజురాబాద్ నియోజకవర్గం బీఆర్‌ఎస్వీ ఇన్‌చార్జి గెల్లు శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందన్నారు. సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ యాదగిరి, పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతం

చేవెళ్ల: గ్రామాల్లోని పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో మేలు చేస్తాయని సర్పంచ్ అరుంధతి అన్నారు. మండలంలోని కందవాడ గ్రామంలో ఆదివారం వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య బృందం కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృద్ధులు కళ్లు కనిపించకపోవడంతో ఆస్పత్రులకు వెళ్లకుండా గ్రామాల్లోనే ఉండిపోతున్నారు. వీరంతా ఈ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకుంటున్నట్లు చెప్పారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో 110 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు.

గడప గడపకూ కేంద్ర ప్రభుత్వ పథకాలు



బీజేపీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

కొందుర్గు: గ్రామ గ్రామాన బీజేపీ జెండా ఎగురవేయడంతో పాటు గడపగడపకు నరేంద్రమోదీ పథకాలను తీసుకెళ్దామని బీజేపీ నేత శ్రీవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కొందుర్గు మండలం శ్రీరంగాపూర్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీశైలం ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే కృష్ణా జలాలతో షాద్‌నగర్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. లక్ష్మీదేవిపల్లి వద్ద పాలమూరు రిజర్వాయర్‌ను కుర్చీ వేసుకొని కూర్చొని నిర్మిస్తామని, లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పిన కేసీఆర్ కనీసం ఒక ఎకరానికైనా నీళ్లు ఇచ్చారా అంటు శ్రీవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాబయ్య, మిథున్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శివారెడ్డి, కుర్మయ్య, అంజయ్య, అశోక్, సుధాకర్ రావు, రమేష్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

కోనోకార్పస్ మొక్కల తొలగింపు



కోనోకార్పస్ మొక్కలను తొలగిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: మానవ మనుగడకు హాని కలిగించే నిషేధిత కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని గత మూడు నెలల క్రితం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, నక్కలపల్లి గ్రామస్తుడు గొన్ల నిరంజన్‌గౌడ్ గ్రామస్తులతో కలిసి గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో ఆదివారం నిర్వహించిన గ్రామసభలో హానికరమైన కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని గ్రామస్తులు తెలపడంతో గ్రామ సర్పంచ్ ఈ తీర్మానాన్ని ఆమోదించారు. గ్రామంలోని కోనోకార్పస్ మొక్కలను గ్రామస్తులతో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ.. ప్రజలకు హాని కలిగించే మొక్కలను గ్రామస్తులతో కలసి తొలగించడం అభినందనీయమన్నారు. దేశంలో ఉన్నటువంటి శాస్త్రవేత్తలు, డాక్టర్లు కోనోకార్పస్ మొక్కల పట్ల ప్రజల ఆరోగ్యాలకు ఇబ్బంది వాటిల్లే విషపూరితమైన వాయువు వస్తుందని నిర్ధారించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల నాయకులు అంజయ్యగౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువును సన్మానించిన పూర్వ విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: 20 ఏళ్ల తరువాత 25 మంది పూర్వ విద్యార్థులు ఒక్క చోట కలుసుకొని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆదివారం మండల పరిధిలోని బాకారం సమీపంలో గల డ్రీమ్ వ్యాల్యూ రిసార్ట్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాడు విద్యాబుద్ధులు నేర్పించిన పూర్వ ఉపాధ్యాయుడు వెంకటేశంను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుడికి పాదాభివందనం చేసుకున్నారు. అనంతరం వెంకటేశం మాట్లాడుతూ.. తల్లిదండ్రుల తరువాత గురువే దైవం, దేవుడితో సమానంగా చూసుకున్నప్పుడే క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సామ రాంమోహన్‌రెడ్డి, సామ నారాయణరెడ్డి, కుమ్మరి నారాయణ, కుమార్, శ్రీకాంత్, అనిత, వసంత, శ్యామల, మంజుల, లత, ఈశ్వరమ్మ, మంజుల, విజయ, యాదగిరిగౌడ్, జహంగీర్‌పాషా, ఈశ్వర్, గణేష్, జమీల్, ప్రభాకర్, మహేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నారుమడే దిగుబడికి కీలకం



షాబాద్ మండలం నాగర్‌గూడలో కూరగాయల నారుమడి

- కూరగాయల నారు పోసే భూమి లోతుగా దున్నాలి
- నీరు పారేలా కాలువలు తీయాలి
- ఉద్యానశాఖ జిల్లా అధికారి సునందారాణి

షాబాద్: జిల్లాలోని చేవెళ్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కూరగాయల సాగు విస్తీర్ణం పెరిగినట్లు దిగుబడులు పెరగడం లేదు. నారుమళ్లలో జాగ్రత్తలు తీసుకోకపోవడమే ఇందుకు కారణమని, పాటించాల్సిన పద్ధతులను జిల్లా ఉద్యానశాఖ అధికారి సునందారాణి వివరించారు.

నేలలు మధ్యస్థంగా ఉండాలి

నారుమడిగా తయారు చేసే భూమిని లోతుగా దున్నాలి. నేలల బరువు మధ్యస్థంగా, నారుమడి పొడవు 150, వెడల్పు 120 సెం.మీ.లోపు ఉండాలి. నులి పురుగులు రాకుండా నేలపై కార్బొఫ్యూరాన్ గుళికలు వేయాలి. ప్రతీ 10 చదరపు మీటర్లకు 40 నుంచి 50 కిలోల పశువుల ఎరువు వేసి, కలియ దున్నాలి. నారుమళ్లలో నారుకుళ్లు తెగుళు వస్తుంది. రాకుండా ఉండేందుకు 0.1 శాతం క్యాప్టాన్ లేదా ఫార్మాల్డిహైడ్ 25 మీ.లీ.ను లీటర్ నీటిలో కలిపి, నేలను శుద్ధి చేయాలి. మొక్కలను చెద, గొంగళి పురుగులు ఆశిస్తాయి. విత్తనాలు విత్తడానికి ముందు క్లోరిపైరిఫాస్ 2 మీ.లీ.ను లీటర్ నీటికి కలిపి, నారుమడి నేలను తడపాలి. రెండు నారుమళ్ల మధ్య, చుట్టూ 8 నుంచి 10 సెం.మీ లోతు, 30 సెం.మీ. వెడల్పుతో కాలువలు తీసి, మురుగు నీరు పారేలా చూసుకోవాలి.

సస్యరక్షణ చర్యలు పాటించాలి...

నారుమడిలో మొక్కలను తరచూ రసం పీల్చే పురుగులు ఆశిస్తాయి. మలాథియాన్ 2 మీ.లీ. లేక ఎండోసల్ఫాన్ 2 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి, పిచికారీ చేయాలి. మొక్కలు బలహీనంగా ఉంటే ఒక శాతం యూరియా ద్రావణం స్ప్రే చేయాలి. ఎప్పటికప్పుడు కలుపు తీయాలి. నారు తీయడానికి ముందు నీరు పెట్టడం తగ్గించాలి. సాయంత్రం వేళల్లో నాటు వేస్తే మంచిది.

విత్తన శుద్ధి చేయాలి...



విత్తే ముందు క్యాప్టాన్ లేదా థైరామ్ 3 గ్రాములను కిలో విత్తనానికి కలిపి, శుద్ధి చేయాలి. టమాటలో విత్తనాన్ని అజోస్పైరిల్లమ్ వంటి బ్యాక్టీరియల్ కల్చర్‌తో కలిపి, వేయాలి. ఎత్తు మడులపై చేతివేళ్లతో గానీ కర్రతో గానీ దగ్గరగా గీతలు గీసుకోవాలి. విత్తనాలను ఇసుకతో కలిపి, వాటిలో పలుచగా చల్లాలి. విత్తనాలు వేసిన వెంటనే వగడ్డితో కప్పితే మొలక శాతం పెరగడంతో పాటు త్వరగా మొలకెత్తుతాయి. విత్తనం వేశాక ప్రతీ రోజు మధ్యాహ్నం, సాయంత్రం రోజ్‌క్యాన్లతో నీరు పెట్టాలి. ఎండాకాలంలో మొలకలకు ఎండ నుంచి రక్షణ కల్పించాలి.

– ఉద్యానశాఖ జిల్లా అధికారి సునందారాణి

మంత్రిని కలిసి హిమాయత్‌నగర్ గ్రామస్తులు

అమ్మవారి ఉత్సవాలకు ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హిమాయత్‌నగర్ గ్రామ సర్పంచ్, గ్రామస్తులు మర్యాదపూర్వకంగా ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా హిమాయత్‌నగర్ గ్రామంలో వచ్చే నెలలో నూతన దేవాలయ ప్రారంభోత్సవం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానిస్తూ గ్రామ సర్పంచ్ మంజుల, గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌యాదవ్ స్పందిస్తూ దేవాలయాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సీఎం కేసీఆర్ దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అందులో మన మందరం పాల్గొన్నప్పుడే ఆధ్యాత్మిక శోభ నెలకొంటుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

బీజేపీలో పలువురి నాయకుల చేరిక

చేవెళ్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి గ్రామాల్లో యువత బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని ఆలూరు గ్రామంలో ఆదివారం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 60 మంది యువకులు బీజేపీలోకి చేరారు. పార్టీలోకి చేరిన వారికి మండలపార్టీ అధ్యక్షుడు పాండురంగారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.